క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మేదరమెట్ల: విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అదాలత్.. అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వినియోగదారుల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించి.. కొన్నింటిని పరిష్కారదిశగా చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో ఈఈ మస్తాన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు పెరిగిన కౌలు

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని చంద్రశేఖరస్వామి ఆలయ భూములకు బుధవారం ఆలయం వద్ద కౌలు వేలం నిర్వహించారు. 14 ఎకరాలకు గత ఏడాది 1.11 లక్షలు పలకగా ఈ ఏడాది 1.41 లక్షలకు రైతులు కైవసం చేసుకున్నారు. పొలాలకు వెళ్లే రహదారిని, పంటకాల్వను అభివృద్ధి పరచాలని రైతులు విన్నవించారు. ప్రతి సంవత్సరం కౌలు వేలం జరుగుతుందని ఆలయ ఈఓ బి. కృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ ధర్మకర్త వంకాల రామాంజనేయులు, ఈవో చావా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నూతన చైర్మన్‌గా నియమితులైన కె.బుచ్చి రాంప్రసాద్‌ను బుధవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్యవేదిక నాయకులు ఎంఏ శేషాచార్యులు, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, దిట్టకవి వాసుదేవాచార్యులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

స్వామిత్ర సర్వే పకడ్బందీగా చేపట్టాలి

యద్దనపూడి: తప్పులు లేకుండా స్వామిత్ర సర్వే చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పూనూరులో స్వామిత్ర సర్వే ప్రక్రియ పరిశీలించారు. భూసర్వే తరహాలోనే గ్రామకంఠాలు , ఇతర స్థలాల్లో నిర్మాణాలు, పశుశాలలను డ్రోన్ల సాయంతో సర్వే చేసి లబ్ధిదారులకు హక్కు పత్రాలు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, వీఆర్వో వసంతరావు, విలేజ్ సర్వేయర్లు, పాల్గొన్నారు.

శ్రీరామచంద్రునికి సహస్ర నామార్చన

చీరాల అర్బన్: పట్టణంలోని వీరరాఘవపేటలో వేంచేసియున్న శ్రీ రామమందిరంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రం పునర్వాసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దిట్టకవి వాసుదేవాచార్యులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

చినగంజాం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో ఓవ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని కడవకుదురు గ్రామం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై ఇరువురు వ్యక్తులు రహదారి ఎక్కుతున్న క్రమంలో చినగంజాం వైపు నుంచి వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చొన్న సోపిరాల గ్రామానికి చెందిన శిఖరం రాము అనే వ్యక్తి కుడి కాలు విరిగింది. గాయపడిన అతన్ని 108 వాహనంలో చీరాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు.

బల్లికురవలో వర్క్‌షాప్ రేపు

బల్లికురవ: మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సెక్రటరీలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక పరిషత్ కార్యాలయంలో వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు ఎంపీడీవో పాండురంగ స్వామి బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు సెక్రటరీలు విధిగా హాజరుకావాలని కోరారు.



కొప్పరపాడు ఎస్టీ కాలనీలో మురుగు



కొప్పరపాడులో వ్యర్థాల కుప్పలు



కాలువలో మొలిచిన పిచ్చి చెట్లు



వల్లాపల్లి ఎస్టీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు వద్ద నిరసన

మురుగుమయం.. హానికరం

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ముందుకు సాగని మురుగు వ్యర్థాల కుప్పలతో ప్రజల వెతలు
- దోమలదాడితో జాగారం

బల్లికురవ: ఓ వైపు వర్షాలు.. మరో వైపు సీజనల్ జ్వరాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ గాలికొదిలేయడంతో వ్యర్థాల కుప్పలు, ముందుకు సాగని మురుగుతో పాటు దోమల దాడి తీవ్రతరమైంది. దీంతో ప్రజలకు కంటిమీద కునుకు పట్టడంలేదు. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరౌతున్నా పాలకుల మధ్య విభేదాలు తలెత్తడంతో నిధులన్నీ బ్యాంకు ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. మండలంలోని వి. కొప్పరపాడు, వెలమవారిపాలెం, జమ్ముల మడక కాలనీ, వల్లాపల్లి ఎస్టీ కాలనీ, పాత మల్లాయపాలెం, ఎస్సీ కాలనీ, యానాది సంఘం, సోమవరప్పాడు, సూరేపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో పారిశుద్ధ్యలేమి తాండవిస్తోంది.

15 నెలలుగా విభేదాలు..

కొప్పరపాడు గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్ పాలక మండలి మధ్య 15 నెలలుగా విభేదాలు నెలకొన్నాయి. దీంతో చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించే రిక్షాలు మూలన పడ్డాయి. మురుగు కాల్వల నిర్మాణాలు గ్రామ ప్రజలకు శాపంగా మారింది. పాలకుల మధ్య విభేదాలకు చెక్ పెట్టాల్సిన మండల, జిల్లా స్థాయి అధికారులు మాట వినడం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో శ్మశాన అభివృద్ధి, ప్రధాన వీధులు, ఆలయాలు, చర్చిల ముందు వేసిన వ్యర్థాల కుప్పలకు తరలించారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ కాలనీలో మురుగు వ్యర్థాల కుప్పలతో ఇబ్బందులు పడుతున్నారు.

మొక్కుబడిగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

పారిశుద్ధ్య కార్యక్రమాలను నవంబర్ వరకు స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టి సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె. వెంకట మురళి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. అయితే అవి పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప రోడ్లపై పారుతున్న మురుగునీరు.. వ్యర్థాల కుప్పల తరలింపునకు ఎలాంటి చర్యలు చేపట్టటంలేదని ప్రజలు వాపోతున్నారు. పత్రికల్లో వార్తలు ప్రచురితం కాగానే వీధుల వెంట సున్నం చల్లించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విభేదాలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టండి



గ్రామ పంచాయతీ పాలక వర్గం మధ్య విభేదాలతో ముందుకు కదలని మురుగు వ్యర్థాల కుప్పలతో ఆరోగ్యం బారిన పడుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మురుగు వ్యర్థాల కుప్పలతో.. దోమల దాడితో జాగారం తప్పటంలేదు.

– బండారు నాగయ్య (కొప్పరపాడు)

చర్యలు తీసుకోండి



గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టనందున రోగాల బారిన పడుతున్నాం. వర్షాలు కురుస్తున్నందున వ్యర్థాల కుప్పలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయి. తక్షణమే వ్యర్థాల తరలింపుతో మురుగు ముందుకు కదిలేలా చర్యలు చేపట్టాలి.

– కుంచపు వీరయ్య (కొప్పరపాడు)

మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ధ్వజం
- అద్దంకిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం



అద్దంకిలో మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ప్రజలను మోసగించటం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండానే అన్నీ ఇచ్చినట్లు చెబుతున్నారన్నారు. ఇచ్చిన ఒకటి, రెండు పథకాలు కూడా అరకొరగా ఇచ్చారన్నారు. చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేర్చలేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష తీర్చుకుంటున్నారు. తమను ఎంత బాధిస్తే అంత రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లోని ఇంటింటి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియ జేయాలన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తే కూటమి పాలనలో ఎవరు సంతోషంగా లేరన్నారు. అధికారం చేపట్టిన సంవత్సరంలోనే ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. తొలుతగా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, మండల కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంతమాగులూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బాబు చెప్పేవన్నీ అబద్ధాలే..

అద్దంకి(సంతమాగులూరు): చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన్న హనిమిరెడ్డి అన్నారు. సంతమాగులూరు మండలంలోని అడ్డరోడ్డులోని వాసవి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ సభలో మాట్లాడారు. బాబు మారాడని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి ప్రజల్ని మోసం చేసి పీఠం ఎక్కారని చెప్పారు. కుర్చీ కోసం మాయలు చేయడం, కూటములు కట్టడం చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడే జగన్ మోహన్ రెడ్డికి అది చేతకాదని చెప్పారు. సమావేశంలో మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కోయి అంకారావు, రమణబాబు, గునుపూడి రఘురామగుప్తా, ఈదా శ్రీనివాసరెడ్డి, పాలపర్తి శ్రీధర్, చైతన్య కిశోర్, ఊడత్తు సురేశ్, జెడ్పీటీసీ అడవి శ్రీను, గ్రామాల నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



కారంచేడులో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా హెచ్చరించారు. బుధవారం కారంచేడు పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన వాహన తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో వాహన యజమానులకు కౌన్సెలింగ్ చేశారు. ద్విచక్ర వాహనదారులు ముందుగా హెల్మెట్ ధరించడంతో పాటు, లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు. ఆటోవాలాలు కూడా యూనిఫాంతో పాటు లైసెన్స్ వెంట తెచ్చుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి, ప్రమాదాలకు గురవ్వవద్దని హెచ్చరించారు. అలాగే వాహనాల్లో మాదక ద్రవ్యాల తరలింపులను నిషేధించాలన్నారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు ఆయన జరిమానా విధించారు.

మహా ధర్నా జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

అద్దంకి: పాత పెన్షన్ స్కీంలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న తలపెట్టి మహా ధర్నా జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మహాధర్నా ఆగస్టు 25న పోస్టర్‌ను అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ స్కీం కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ అధ్యక్షుడు రామారావు, యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ పూర్ణచంద్రరావు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు నాగరాజు, అనపర్తి రమేష్, నాయకులు బాబు రావు, శంకర్ ఐతా శ్రీనివాసరావు, భాస్కర్ రావు, కొమ్మాలపాటి కోటేశ్వరరావు సుబ్బారావు, టి. ఐజాక్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి



ఎయిడ్స్/ హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బారామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో బుధవారం ఎయిడ్స్/ హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ విజశ్రీ, డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నివారణకు తీసుకోవలసిన చర్యలు, ఆరోగ్య భద్రత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉషారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సీతారామిరెడ్డి, విద్యార్థులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బార్ కోసం దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న కమిషనర్

అద్దంకి: నూతన పాలసీ ప్రకారం అద్దంకి మునిసిపాలిటీ పరిధిలో ఒక బార్‌ను నోటిఫై చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రకాశం జిల్లా కమిషనర్ హేమతల నాగరాజు చెప్పారు. బుధవారం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడారు. బార్ లైసెన్స్ కోసం రూ.5లక్షల దరఖాస్తు ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలని చెప్పారు. ఒక సంవత్సరానికి లైసెన్స్ ఫీజు రూ.35 లక్షలుగా నిర్ణయించామని చెప్పారు. ఇది ప్రతి సంవత్సరం 10 శాతం పెరుగుతుందని వివరించారు. ఈ బార్ లైసెన్స్ కోసం 21 సంవత్సరాలు దాటిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఒకరు ఎన్ని దరఖాస్తులైనా వేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 26తో గడువు ముగుస్తుందని చెప్పారు. ఈ నెల 28న బాపట్లలో లాటరీ పద్ధతిలో బార్ కేటాయిస్తామని వెల్లడించారు. వివరాలకు 6281288914 నంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

దోమల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్



మేదరమెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మేదరమెట్ల: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని మేదరమెట్ల యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ శ్రావణి అన్నారు. ప్రపంచదోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. మురుగునీటి గుంటలు ఉంటే వాటిలో ఆయిల్ బాల్స్ వేయడం పరిసరాల్లో బ్లీచింగ్ చల్లడం చేసుకోవాలన్నారు. దోమ కాటు నుంచి కాపాడుకోవడానికి దోమతెరలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమకాటు ప్రాణాంతకం

ఉప్పుటూరు(చినగంజాం): దోమ కాటుతో ప్రాణాంతకమై వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పర్చూరు మండలం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యుడు.. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ బుధవారం ప్రజలకు దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి సంవత్సరం 700 మిలియన్‌ల ప్రజలు దోమల వల్ల వ్యాధులకు గురవుతున్నారని వారిలో 10 లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ కూడా దోమ కాటు వలన మరణించాడని, కావున దోమల్ని నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మొదటిగా దోమలు గుడ్లు పెట్టడానికి అవసరమైన నీటి నిల్వలు, కొబ్బరి చిప్పల్లో, టైర్లలో, కుండల్లో, కూలర్‌లలో లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే రెండో దశలో నీటి నిల్వలు తప్పని ప్రదేశాల్లో లార్వాలను అరికట్టే గంబూసియా చేపలు లేదా అబోట్ల గడ్డి లేదా ఆయిల్ బాల్స్ చేయాలని, మూడో దశలో దోమలు మనల్ని కుట్టకుండా దోమతెరలు, మస్కిటో రిపెలెంట్స్, ఒడోమాస్, అలౌట్ వంటివి వాడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నీలాం వెంకట రామకృష్ణ, ఏఎన్ఎం విజయలక్ష్మి, సీహెచ్ఓ శృతి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగు చేస్తే చర్యలు

జె.పంగులూరు: మండల పరిధిలో గ్రామాల్లో రైతులు పొగాకు సాగు చేసిన, పొగాకు నారుమళ్లు చేసిన రైతులపై చర్యలు తప్పవని ఏఓ సుబ్బారెడ్డి హెచ్చరించారు. చిన్నమల్లవరం, పంగులూరులో బుధవారం మాట్లాడుతూ నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు నారుమడి, బర్లి పొగాకు సాగు నిషేధించామని తెలిపారు. ఖరీఫ్ 2025కు సంబంధించి పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, తద్వారా అనేక ఉపయోగాలున్నాయని తెలిపారు. ప్రధనమంత్రి పంటల బీమా యోజన పథకం కింద బీమా చెల్లించాలని కోరారు. వ్యవసాయ సహాయకులు వినయ్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలు పరిష్కరించుకోండి



ఇడుపులపాడు సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): రీ సర్వేలో భూములకు సంబంధించి తలెత్తిన సమస్యలను రైతులు గ్రామ సభ ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఇడుపులపాడులో బుధవారం రీ సర్వేపై తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ గ్రామ సభ నిర్వహించారు. ప్రతి రైతు వారి ఆధార్, ఫోన్ నంబర్, ఫోటోలు తదితర సమాచారాన్ని గ్రామ రెవెన్యూ అధికారికి అందజేసి రీ సర్వేలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. జాయింట్ ఎల్‌పీఎంలు, పెండింగ్‌లో ఉంటే వారు ఏ రాష్ట్రంలో, ఏ ఊరిలో ఉన్న సమాచారం తెలియపరచి జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టుకోవాల్సిందిగా సూచించారు. మండల సర్వేయర్ సాంబశివరావు, రీ సర్వే డీటీ భాగ్యరాజు, గ్రామ సర్వేయర్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చినగంజాంలో...

నేడు మోటుపల్లి గ్రామంలో గ్రామ సభ

మండలంలోని మోటుపల్లి గ్రామ సచివాలయం వద్ద 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. మోటుపల్లి గ్రామంలో రీసర్వే పూర్తి అయిందని 13 నోటిఫికేషన్ కూడా జారీ చేశారన్నారు. రైతులందరూ తమ భూములను ఎల్‌పీఎం నంబర్‌ల ప్రకారం సరిపోకుంటే గ్రామ సభలో వారి వద్ద హక్కుగల రికార్డులతో అర్జీలు అందజేయాలని సూచించారు.

ఈగల్ క్లబ్‌తో ఉపయోగం

ఇంకొల్లు (చినగంజాం): ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈగల్ క్లబ్.. శక్తి యాప్ గురించి ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడవర్తి పేరారెడ్డి అధ్యక్షత వహించారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ఈగల్ క్లబ్ పని విధానం గురించి, విద్యార్థుల పాత్ర, ఉపాధ్యాయుల పాత్ర గురించి వివరించారు. మాదకద్రవ్య దుర్వినియోగం.. ప్రమాదాల గురించి అవగాహన పెంచడానికి.. మాదకద్రవ్య రహిత వాతావరణాన్ని ప్రోత్సహించడానికి ఈ క్లబ్‌లు విద్యా సంస్థల్లో స్థాపించినట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి మాదక ద్రవ్య దుర్వినియోగం గురించి అవగాహన కల్పిస్తారన్నారు. ప్రభుత్వం అన్ని విద్యా సంస్థల్లో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించిందన్నారు. క్లబ్ ముఖ్య ఉద్దేశాలు విద్యార్థులతో మమేకం అవ్వడం, ప్రచారం నిర్వహించడం, మాదక ద్రవ్య వ్యతిరేక సందేశాలను పాఠ్యాంశాల్లోకి చేర్చడం ద్వారా అవగాహన కలిగించాలన్నారు. మహిళలకు రక్షణ కవచం వంటి శక్తి యాప్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి, ఇన్‌స్టాగాం వలన కలిగే అనర్థాలు గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈగల్ క్లబ్‌ల గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్ సూచించారు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈగల్ క్లబ్.. శక్తి యాప్ గురించి బుధవారం ఇంకొల్లు ఎస్ఐ జి. సురేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడవర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించారు. పెరుగుతున్న మాదక ద్రవ్య దుర్వినియోగాన్ని పరిష్కరించడానికి ఏపీ ప్రభుత్వం అన్ని విద్యా సంస్థల్లో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించిందన్నారు.

శ్మశానం కోసం స్థల పరిశీలన

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని హనుమోజీ పాలెం గ్రామంలో శ్మశాన స్థలం కోసం తహసీల్దార్ ఏవీ ఎస్ శ్రీనివాస్ బుధవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలో కొందరు శ్మశానం కోసం స్థలం వితరణ చేస్తున్న దృష్ట్యా ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి అడ్డగడ వెంకటేశ్వర్లు, ఆర్ఐ జి. రాజేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీరామునికి అభిషేకం

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని శ్రీరామ మందిరంలో స్వామివారి జన్మనక్షత్రం పూర్వర్వసు రావటంతో బుధవారం మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం, ఏకాహం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు శ్రీరామ మందిర కమిటీ అధ్యక్షుడు రావూరి రంగయ్య అన్నదానం నిర్వహించారు.